

# అక్కడే ఆగక

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

**వారికి జీతం, శెలవు రోజులు లేవు.** గూడు, కూడు, బట్ట మాత్రమే ఇచ్చేవారు. ముఖ్యంగా కరీబియన్ ఐలాండ్స్‌లో, నార్త్, సౌత్ అమెరికాల్లో లేబర్‌కి డిమాండ్ పెరగడంతో వారి రవాణా కొనసాగి, బ్రిటన్ ప్రపంచంలో నల్లబానిసల వ్యాపారంలో ప్రధాన పాత్ర వహించింది. లండన్, బ్రిస్టల్, లివర్‌పూల్‌లోని బ్రిటీష్ ఓడల వ్యాపారస్థులకి ఓడల్లో తెచ్చే ఆఫ్రికన్ బానిసలు అత్యధిక లాభాలని తెచ్చారు. "ప్రపంచంలో కేప్ కేజిల్ కన్నా భయంకరమైన చోటు ఏది?" అతను అడ్గాడు.

"ఆస్క్‌విడ్జ్" ఎన్రికో వెంటనే చెప్పాడు.

"సిరియా" మరొకరు చెప్పారు.

"రేపాఫ్ నాన్‌కింగ్" చైనీస్ చెప్పాడు.

"నన్నడిగితే సర్కస్" బాకో నవ్వుతూ చెప్పాడు.

"సర్కస్? ఎలా?" ఒకరు అడిగారు.

"ఏనుగు మరణిస్తే, దానికి గొయ్యి తవ్వాల్సిన వ్యక్తి పడే కష్టాన్ని తలచుకుంటే నా కష్టం కష్టం అనిపించదు."

ఆ జోక్‌కి అంతా వెంటనే నవ్వారు.

"నేనెప్పుడూ సందర్శకులని చిరునవ్వుతోనే పంపుతుంటాను. ఎనీ మోర్ క్వశ్చన్స్?.... నో? దెన్ గుడ్ బై ఎవ్విరి వన్ అండ్ గుడ్ లక్. అన్నట్లు ఘానాలోని ఇలాంటి మరో కోట ఎల్మినా. పోర్చుగీస్, డచ్, ఇంగ్లీష్, అమెరికన్స్ ఒకరి తర్వాత మరొకరు దాని యజమానులు. వీలుంటే దాన్నీ దర్శించండి. అక్కడ ఓ కోటలో ఓ బానిస గోడమీద రాసింది మీకు గుర్తు చేస్తాను. 'జీవితం నిండా విషాదం ఒపరచుకుని ఉందని నాకు తెలుసు. కాని దాన్ని నేను ఎంతదాకా అనుమతిస్తే అది అంతవరకే.' సచే నైస్ ఫిలాసఫీ. ఈ ఒక్కదాన్ని అర్థం చేసుకుని అనుసరిస్తే మనకి ఎందుకు నిరుత్సాహం, అసంతృప్తి, విచారం కలుగుతాయి?" అతను ఆ రాసింది నొక్కి చెప్పాడు.

పర్యాటకులు గైడ్‌కి తలో కాస్తా సిడీలు టిప్‌గా ఇచ్చారు. చైత్ర, ఎన్రికో కూడా చెరో పాతిక సిడీలు ఇచ్చారు. అందరికీ థాంక్స్ చెప్పి గైడ్ వెళ్ళిపోయాక మ్యూజియానికి వెళ్ళారు. అందులో ఫోటోలు తీయకూడదు. తిరుగుబాటు చేసిన

బానిసలకి తొడిగిన ఇనప గొలుసులు, వాళ్ళని కొట్టిన ముళ్ళ కొరడాలు, ఆనాటి వారి దుస్తుల నమూనాలు, ఫోటోలు, ఊహా చిత్రాలు, దంజన్ ఫోటోలు మొదలైనవి ఉన్నాయి. వారికి వచ్చిన వ్యాధుల వివరాలు, అది సోకిన ఎంత కాలానికి ఏ బాధా లక్షణాలతో మరణిస్తారు మొదలైన ఛార్ట్, గవర్నర్స్ పేర్లు, వారి పదవీకాలం, సైనికులు వాడిన ఆయుధాలు, మోడల్ యూనిఫాం, ఫిరంగి గుళ్ళు మొదలైనవి ఉన్నాయి.

అక్కడ సావనీర్‌గా అమ్మే ఓ ఇంగ్లీష్ ఫలకాన్ని ఆద్య కొన్నది.

వేరే రంగుగల మనిషిని నేను

నీ చర్మ  రంగుకి వేరైన రంగు చర్మంతో జీవించడానికి నేను పుట్టాను.

నా చర్మం నలుపైతే, మార్పులేని ప్రకృతి  చేతులు

నీ చర్మంలో పొదిగిన పిగ్మెంట్స్ కారణంగా

నీ చర్మం రంగు తెలుపు, బ్రౌన్, పసుపులుగా మార్చింది.

నా చర్మంకింద నేను, నీ చర్మం కింద నీలా మనిషినే.

నా కండరాలు అదే శక్తితో పనిచేస్తాయి.

నా మెదడుకూడా నీ మెదడులానే పనిచేస్తుంది.

నీలానే ప్రేమిస్తాను. ద్వేషిస్తాను. ఆశ నిరాశలకి లోనవుతను.

నీలాగే నేనూ కలలు కంటాను. శారీరక సుఖాన్ని అనుభవిస్తాను.

నా ధ్యేయాలని నెరవేర్చుకోవాలని అనుకుంటాను.

నా పిల్లలు జీవితంలో న్యాయమైన అవకాశాలని పోగొట్టుకున్నప్పుడు,

వారు చేదైన పక్షపాతపు రోడ్లో నడవాలని గ్రహించినప్పుడు,

అప్పుడు నా రంగు నాకు శతృవని తెలుస్తుంది.

న్యాయమైన ప్రపంచాన్ని నువ్వు, నేను కలిసి నిర్మించడానికి,

నేను వచ్చినప్పటికన్నా, వెళ్ళేప్పుడు ప్రపంచాన్ని

ఇంకాస్త మెరుగ్గా చేసి వెళ్ళడానికి కృషి చేస్తాను.

వేరే రంగు గల మనిషిని నేను.'

దాన్ని కొన్న ఆద్యతో ఎన్రికో చెప్పాడు.

"మనుషుల్లో చాలా జాతులు ఉన్నాయి. మనం ఓ చైనీస్‌నో, ఆఫ్రికన్నో, యూరోపియన్నో చూసినప్పుడు చాలా తేడాగా ఉన్నారని అనుకుంటాం. కాని వారి మధ్య గల తేడా చాలా స్వల్పం. అమెరికన్ జెనెటిసిస్ట్ హెన్రీ  హార్పెండింగ్

మనుషులు పిసిలలాంటి వాళ్ళని, కంప్యూటర్ జాతులు కూడా మనుష్య జాతుల్లాంటివే. వీటి మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయా? లేవు. పై కేస్‌ని తొలగించాక వాటిలో ఏది దేనిదో కనుక్కోలేం. ఓ పి.సిలోని విడి భాగాలని ఇంకో పి.సికి మార్చగలం. మనుష్య జాతిలోని తేడాలు కూడా ఇంతే. మనుషుల పై చర్మం రంగు, ఆకృతి, భాష, సంస్కృతి, దేశం, మతంలాంటివి చూసి వారికో లేబుల్ తొడుగుతాం. కాని లోపల మాత్రం అంతా ఒక్కటే. వారిలో జెనెటిక్‌గా పెద్దగా తేడాలు ఉండవు. ఇది తెలియకే ప్రపంచంలో ఎన్నో సామూహిక హత్యలు, మరణాలు."

అతను కాసేపాగి మళ్ళీ చెప్పాడు.

"ప్రతీ వ్యక్తి ముప్పై తరాలు వెనక్కి వెళితే, ఒక్కో తరం వయసు సగటున పాతికేళ్ళు అనుకుంటే, అంటే ఏడు వందల ఏభై ఏళ్ళు వెనక్కి వెళితే, అంటే క్రీ.శ 1250కి వెళ్ళిఆ వ్యక్తికి గల వారసుల సంఖ్యని లెక్కకడితే, ఈ ఏడు వందల ఏభై ఏళ్ళలో వంద కోట్లమంది ఉద్భవించారని లెక్క తేల్చారు. మన మూలాలని వెతుక్కుంటూ వెళితే ఎక్కడో ఓ చోట ప్రపంచంలోని అందరితో మనకి బాంధవ్యం ఉండి తీరుతుంది. ఈ దృష్టితో చూస్తే మనకి ప్రపంచంలో రక్తసంబంధీకులు కాని వారంటూ ఎవరూ లేరు. అంతా మనకి తల్లి లేదా తండ్రివైపుకి చెందినవారే, వారు సోదరి లేదా సోదరుడు, అత్త లేదా మామ, పెదనాన్న లేదా పెద్దమ్మ, బాబాయ్ లేదా పిన్నమ్మ ఇలా ప్రతీ వ్యక్తీ ఈ ప్రపంచంలోని మరో వ్యక్తికి ఏదో వరసకి చెందినవారవుతారు. ఈ వాస్తవ దృష్టితో చూస్తే ప్రపంచంలో ఈ అందరూ మనకి కావాల్సినవాళ్ళే, ఐనవాళ్ళే తప్ప పరాయివాళ్ళంటూ లేరు .కాబట్టి జాత్యాహంకారంతో, మతవిభేదాలతో శతృత్వం అవివేకమే అవుతుంది."

ఆ కేజ్‌లోంచి బయటకి వెళ్ళే ఎవరి మొహాల్లో ఉత్సాహం లేదు. ఒకరితో మరొకరు మాట్లాడుకోకుండా అంతా బాధతో నిశ్శబ్దంగా బయటకి నడిచారు.

ఐజాక్‌కి ఫోన్ చేస్తే ఐదు నిమిషాల్లో వచ్చాడు. భారమైన మనసులతో అక్కాచెల్లెళ్ళిద్దరూ బండి ఎక్కాక అది కదిలింది.

"ఆఫ్రికాలో, అమెరికాలో నేను విన్న మూడు ప్రేమ కథలు గుర్తువస్తున్నాయి" కొద్దిసేపాగి ఎన్రికో చెప్పాడు.

"చెప్పు" చైత్ర అడిగింది.

"1883లో సౌత్ ఆఫ్రికాలో జులు లీడర్ సెటెవాయో బ్రిటీష్ సెటిలర్స్ మీదకి నటల్ అనే చోట యుద్ధానికి వెళ్ళి గెలిచాడు. అతని నియమం, తన సైన్యంలోని యువకుల ఈటెలు శతృ రక్తంతో తడిసాకే పెళ్ళికి అర్హత వస్తుంది. అలా ఓ జులు యువతిని రాజు తన సైనికుల్లోని ఒకరికి భార్యగా ఎంపిక చేసాడు. ఆమె అప్పటికే మరొకర్ని ప్రేమించడంతో ఇసిద్వాబ అనే పెళ్ళైనవారే ధరించే పొడవైన స్కర్ట్‌ని ధరించి మోసం చేసింది. కాని ఆమె మోసం బయటపడింది. ఆ సైనికుడ్ని పెళ్ళిచేసుకోడానికి ఆమె నిరాకరిస్తే సెటెవాయో ఆజ్ఞ మీద ఓ జలపాతం దగ్గరకి తీసుకెళ్ళి అందులోంచి కిందకి తోసేసారు. ఆమె పొడవైన స్కర్ట్ గాల్లో పేరాచ్యూట్‌లా పనిచేసి రాళ్ళకి కొట్టుకోకుండా నీళ్ళల్లోకి దిగింది. ఆమె

యూరోపియన్ సెటిలర్స్ దగ్గరకి చేరుకుంది. ఆమె కథ విన్నవారు ఆ జలపాతానికి 'ఇసిద్వాబా జలపాతం' అనే పేరు పెట్టారు. నేనా జలపాతాన్ని జులు లేండ్‌లో చూసాను" ఎన్రికో చెప్పాడు.

"రెండోది?" ఆద్య ఆసక్తిగా అడిగింది. "ఓ ప్రేమికుడు 'నువ్వు నన్ను ప్రేమిస్తే, రేపు ఎర్రరంగు డ్రస్ వేసుకురా' అని ఉత్తరంలో రాసి ఆమెకి ఓ టెక్స్ట్‌బుక్‌లో పెట్టి ఇచ్చాడు. మర్నాడామె నీలం రంగు డ్రస్ వేసుకొచ్చి నవ్వుతూ ఆ పుస్తకంతిరిగి ఇచ్చింది.

ఆ కుర్రాడు ఓ రోజు ఆ పుస్తకం తీస్తే, అందులోంచి ఆమె తన ఉత్తరం కింద రాసిన జవాబు కింద పడింది. సారీ డార్లింగ్! నాకు ఎర్ర డ్రస్ లేదు. ఐ లవ్ యు టూ కనిపించింది – 12 ఏళ్ళ తర్వాత."

"ఓ! హౌ ట్రాజిక్" ఆద్య వెంటనే చెప్పింది.

"మూడోది చిత్రమైంది. ఇంకా కొలంబస్ అమెరికాని కనుక్కోక మునుపటి కథ ఇది. మిస్సోరి రాష్ట్రంలోని రెడ్ ఇండియన్స్‌లో చెరూకీ, నవజో అనే రెండు తెగలు ఉండేవి. ఓ పెద్ద చెరువుకి అటు, ఇటు ఈ రెండు తెగలవాళ్ళు జీవించేవారు. వారికి ఒకరంటే మరొకరికి పడదు. ఒకరికొకరు ఎదురుపడితే ఎవరో ఒకరు మరణించేవారు. ఓ రోజు ఆ రెండు తెగలకి చెందిన ఓ యువకుడు, ఓ యువతి ఒకరికొకరు ఎదురుపడ్డారు. తొలిచూపులోనే వారి మధ్య ప్రేమ అంకురించింది. ప్రతీ అమావాస్య రాత్రి అతను పడవమీద చెరువుని దాటి ఆమెని ఓ రహస్య ప్రదేశంలో కలుసుకునేవాడు. తెల్లవారుఝామున భారమైన మనసులతో విడిపోయేవారు.

ఓ అమావాస్య రాత్రి అతనికి తన పడవ కనపడలేదు. అతని తెగ పెద్ద తనే దాన్ని దాచేసానని, అవతలికి వెళ్ళే సాహసం చేయద్దని వారించాడు. కాని ఆ ప్రేమికుడు ఆయన మాట వినలేదు. చలికాలమైనా మంచు తేలే ఆ చెరువు నీటిలో ఈదుతూ ఆమెని చేరుకునే ప్రయత్నం చేసాడు. కాని సగం దూరం ఈదాక ఒళ్ళు కొంకర్లు పోయి ఇక ఈదలేక చెరువులో మునిగి మరణించాడు. ఇది తెలిసిన ఆమె మళ్ళీ ఇంకో మగాడ్ని కన్నెత్తి చూడలేదు. ఆ చెరువుకి రెడ్ ఇండియన్స్ ఏం పేరు పెట్టారో ఊహించగలరా?" ఎన్రికో ప్రశ్నించాడు.

"లవ్ లేక్?" ఆద్య అడిగింది.

"క్యుపిడ్ లేక్" చైత్ర చెప్పింది.

"రెండూ తప్పు. ఆ ప్రేమికుడు చేసిన పని దృష్ట్యా లేక్ స్టుపిడ్ అనే పేరు పెట్టారు."

"అయ్యో" వెంటనే ఆద్య చెప్పింది.

"సర్. ఇక్కడ కొబ్బరి కల్లు దొరుకుతుంది. చాలా రుచిగా ఉంటుంది" ఐజాక్ కొద్ది దూరం వెళ్ళాక చెప్పాడు.

"కావాలి. అదోసారి తాగాను. నేచురల్ ఫెర్మంటేషన్‌తో చాలా మత్తు వస్తుంది. కాని త్వరలో దిగిపోతుంది" ఎన్రికో చెప్పాడు.

"నాకూ ఓ ప్రేమకథ గుర్తుకొస్తోంది. ఓ డాక్టర్ తరచు హాస్పిటల్‌ని సందర్శించే ఓ వృద్ధుడ్ని చూసాడు. ఓ రోజు ఆయన్ని డాక్టర్ 'ఎవరికోసం వస్తున్నారు?' అని అడిగితే, 'నా భార్య మార్గరేట్ కోసం' అని ఆయన జవాబు చెప్పాడు.

'కాని ఆవిడకి అల్జైమర్స్ వ్యాధి ఉంది. మిమ్మల్ని గుర్తుపట్టలేదు కదా?' అని డాక్టర్ అడిగితే,

'నేను గుర్తుపట్టగలను కదా?' అని నవ్వుతూ జవాబిచ్చాడు. అదో గొప్ప ప్రేమకథగా నాకు గుర్తుండిపోయింది" చైత్ర చెప్పింది.

"ఇదే నిజమైన ప్రేమ, అసలైన స్వీట్ నథింగ్. పెళ్ళంటే శృంగారం మాత్రమేకాదు. మనసుతో స్నేహం అవసరం" ఎన్రికో చెప్పాడు.

ఐజాక్ కారుని ఓ మట్టి రోడ్‌లోకి తిప్పాడు. అక్కడో చిన్నకొండ పక్కన బండరాళ్ళ మీద కూర్చున్న ఆడవాళ్ళు దాన్ని అమ్ముతున్నారు. ఐజాక్ వారితో స్థానిక భాషలో మాట్లాడి ముగ్గురికీ దాన్ని ఇప్పించాడు. కొబ్బరి చెట్టెక్కి అప్పటికప్పుడు దింపిన కల్లుని ఆకులతో లాఘవంగా అల్లిన పాత్రలో పోసిచ్చారు.

"సర్. వెంటనే తాగితే ఇది జ్యూస్. ఆలస్యం చేసేకొద్దీ ఫర్మెంటై మత్తు వస్తుంది. ఒకోటి స్థానికులకి పది సిడిలకి అమ్ముతారుట. మీకు ఎంత తోస్తే అంత ఇవ్వమని చెప్తున్నారు."

ఎన్రికో వంద సిడిల నోట్‌ని ఇచ్చాడు. వాళ్ళు ఐజాక్‌తో ఏదో చెప్పగానే దాన్ని అర్థం చేసుకున్న చైత్ర చెప్పింది.

"వెనక్కేం ఇవ్వక్కర్లేదని చెప్పు."

అది విన్న వారి మొహాలు వికసించాయి. మళ్ళీ కారు బయలుదేరింది. ఆద్యకి అది రుచిగా ఉండటంతో త్వరగా మొత్తం తాగేసింది. చైత్ర, ఎన్రికోలు కొద్దికొద్దిగా తాగసాగారు.

"ఎక్కి ఇప్పుడు బావుంది" చైత్ర కాసేపాగి నవ్వుతూ చెప్పింది.

"ఎందుకనో దేవుడు ఆఫ్రికన్స్‌ని అన్యాయం చేసాడని నాకు అనిపిస్తూంటుంది. మిగిలిన ప్రాంతాల వారికి తెలుపు, బ్రౌన్. పసుపు రంగు చర్మాలిస్తే దేవుడు కొన్ని ఆఫ్రికన్ దేశాలవారికి కారు నలుపు చర్మం ఇచ్చాడు. వారికి జుట్టందాన్ని ఇవ్వలేదు. రింగులు  తిరిగిన అరంగుళం కూడా పెరగని జుట్టుని ఇచ్చాడు. నల్లటి ఆఫ్రికన్స్ తలమీద మంచి జుట్టు కనిపించిందంటే వారు విగ్‌ని పెట్టుకున్నారని అర్థం. వారి మేకప్‌లో విగ్ ప్రధానమైంది" ఎన్రికో చెప్పాడు.

"అవునా? నాకిది తెలీదు" ఆద్య చెప్పింది.

"ఆఫ్రికన్స్ పెద్దగా బావుండరు. మనకవి అందవిహీన మొహాల్లా అనిపిస్తాయి. ప్లీజ్ ఫర్‌గివ్‌మీ ఐజాక్..."

"ఇట్సాల్‌రైట్ సర్" ఐజాక్ జవాబు చెప్పాడు.

"ప్రపంచంలో మరే ప్రాంతంలోలేని ఎల్లో ఫీవర్, ప్రాణాంతక మలేరియాలాంటి విషపూరిత రోగాలని వీళ్ళకి ఇచ్చాడు. అత్యంత విషపూరిత సర్పాలు ఆఫ్రికాలో ఉన్నాయి. క్షామం. 1998లో సూడాన్‌లో గొప్ప క్షామం వచ్చి నైరుతీ

దిక్కులో రెండున్నర లక్షలమంది మరణించారు. ఆఫ్రికాకి అపార వనరుల సంపద ఉంది. నీరు, భూమి, అడవులు, వజ్రాలు, బంగారం, ఆయిల్, కష్టపడి పనిచేసే మనుషులున్నారు. కాని ఆ సంపద సగటు పౌరుడికి అందడంలేదు. ట్రైబల్ చీఫ్స్, వార్ లార్డ్స్, మల్టీనేషనల్ కార్పొరేషన్స్ పోలీసులు, ప్రభుత్వాధికారులు, రాజకీయనాయకులు వాటిని దోచుకుని ధనవంతులయ్యారు."

"నిజమే సార్. ఎదిరించే వాడు లేకపోతే బెదిరించేవాడే పాలకుడవుతాడు సార్" ఐజాక్ చెప్పాడు.

"ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో మొనార్కీ ఇంకా కొనసాగుతోంది. ఆఫ్రికా దేశాల్లో ధనవంతులైన కొందరి ఇళ్ళల్లో ఈతకొలనులు ఉంటే, కొందరికి తాగడానికి స్వచమైన నీరే లేదు. చాలా దేశాల్లో సంపద మైనారిటికి వెళ్ళి మెజారిటీ ప్రజలు బీదవాళ్ళుగా కొనసాగుతారు. వారు ఏం తలచుకుంటే అదే చట్టం. స్వాజీలేండ్ రాజు స్వాతి – 3 తన ముప్పై మూడో పుట్టినరోజున కన్యాత్వపు చట్టాని తెచ్చాడు. కన్యలు సెక్స్‌లో పాల్గొనడాన్ని, పేంట్స్ ధరించడాన్ని, మగాళ్ళతో కరచాలనం చేయడాన్ని ఈ చట్టంతో నిషేధించారు. కన్యలని గుర్తించడానికి వీలుగా వారు నీలం, నలుపురంగు స్కార్ఫ్‌ని ధరించి తీరాలి. ఈ చట్టాన్ని అతిక్రమించే స్త్రీ పురుషులు ఫైన్‌గా ఓ ఆవుని ప్రభుత్వానికి సమర్పించాలి"

"పాలకులు ఎక్కడైనా ఒకటే. నేనోసారి సెంట్రల్ ఆఫ్రికా రిపబ్లిక్‌కి వెళ్ళాను. ఆఫ్రికాలోని బీదదేశాల్లో అదొకటి. దాని రాజు బొకాసో ఒన్ 1977లో దాన్ని సెంట్రల్ ఆఫ్రికా ఎంపైర్‌గా మార్చి, తను నెపోలియన్ సింహాసనం అధిష్టించినప్పటి ఉత్సవాన్నే అనుసరించాడు. అప్పట్లో రెండు కోట్ల అమెరికన్ డాలర్లు ఆ సెర్మనీకి ఖర్చై, ఆ దేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీసింది. ఆ దేశంలో యురేనియం, డైమండ్ మైన్స్ ఉన్నా ప్రజలు బీదరికంలో మగ్గుతున్నారు. రెండేళ్ళ తర్వాత అతన్ని తొలగించి, తిరిగి దాన్ని సెంట్రల్ ఆఫ్రికా రిపబ్లిక్‌గా మార్చారు" చైత్ర చెప్పింది.

"దేవుడూ నీ రంగేమిటని అడగడు, నీ కేరక్టర్ ఏమిటని అడుగుతాడని మా నాయనమ్మ చెప్పేది" ఆ సంభాషణ వినే ఐజాక్ క్రాస్ గుర్తు వేసుకుని నెమ్మదిగ చెప్పాడు.

"ఆఫ్రికాలోని ఎరిట్రియాకి 1993లో స్వతంత్రం వచ్చాక ఎన్నుకోబడని ప్రెసిడెంట్‌గా ఇసాయిస్ అఫెవెర్కీ కొనసాగుతున్నాడు. ఇంతదాకా ఆ దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థ, సివిల్ సొసైటీ సంస్థలు, ప్రజలకి సామాజిక హక్కులు లేవు. వేలమంది ప్రజలు జైళ్ళల్లో నిరవధికంగా, కుటుంబ సందర్శనలు, వైద్య సహాయం, సరైన భోజనం, నీరు లేక మగ్గుతున్నారు. యు.ఎస్.హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రకారం ఆ దేశంలో అభివృద్ధి సంకేతాలేం లేవు. ఒందరి చేతుల్లోనే అధికారం కొనసాగుతోంది. ప్రకృతి ఇచ్చిన అన్ని రిసోర్సెస్ ఉన్నా చెడ్డ నియంతలవల్ల ప్రజలు బీదగా ఉన్నారు. నరమాంస భక్షకుడైన ఇడీ అమీన్ కూడా నియంతే. ఆఫ్రికాలోని ఓ బీద దేశానికి వెళ్ళిన ఓ క్రిస్టియన్ మిషనరీ చర్చ్‌కి హాజరైన భక్తుల ఒంటిమీది మాసి పీలికలైన దుస్తులని చూసి, 'రేపు నేను మీ అందరికీ కొత్త బట్టలు కొంటాను' అని చెప్పాడు. వెంటనే అందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆనందం లేదా కృతజ్ఞతతో కాదు. చాలా సంవత్సరాల తర్వాత వాళ్ళు 'రేపు' అన్న పదం

ఆ రోజే విన్నారు. వీరి మరో వికృతాచారం పసికందులనించి పదిహేనేళ్ళలోగా ఏదో రోజు ఆడపిల్లలకి జెనిటల్ మ్యుటిలేషన్ చేయడం. ఫలితంగా కొందరు రక్తస్రావంతో మరణిస్తే, కొందరు ఇన్‌ఫెక్షన్స్‌తో బాధపడతారు. ప్రసవ సమయంలో కూడా వారు ఇబ్బందికి గురవుతారు. ముప్పై దేశాల్లో ఇది జరుగుతోంది" ఎన్రికో బాధగా చెప్పాడు.

"యు సెడిట్ సర్. యు సెడిట్" ఐజాక్ దాంతో ఏకీభవిస్తూ చెప్పాడు.

కొద్దిసేపాగి ఐజాక్ చెప్పాడు.

"ఆఫ్రికా ఖండంలో అంతా నల్లగా ఉండరు సార్. మెడిటరేనియన్ సీకోస్ట్‌లోని దేశాల్లోని వారు,అంటే ఈజిప్ట్, మొరాకో, టునీసియా,అల్జీరియాలలోని వారు తెల్లగా ఉంటారు. ఇథోపియా, సోమాలియా, యెమెన్ దేశస్థులు మీడియం కలర్‌లో ఉంటారు. లిబియా నించి వచ్చినవారిలో నల్లవాళ్ళని, తెల్లవాళ్ళని చూసాను. వాళ్ళు మిక్స్ ఉంటారు."

"అవును. లిబియా లీడర్ మౌమర్ గడాఫీ తెల్లగా ఉంటాడు. పాపం అతన్ని అమెరికావాళ్ళు చంపేసారు" చైత్ర చెప్పింది. దేశంలో చికిత్స లేకపోతే ప్రభుత్వం ఖర్చుతో వారిని విదేశీ హాస్పిటల్స్‌కి పంపేవాడు. ఆయిల్ అమ్మకాల్లోని కొంత శాతం ప్రజల బేంక్ ఎకౌంట్లోకి వెళ్ళేది. అమెరికన్స్‌ని వ్యతిరేకించడంతో వారు అతన్ని చంపించారు. సౌతాఫ్రికాలోని మహిళల్లో అధికభాగం జీవితకాలంలో ఓసారైనా బలాత్కరించబడుతున్నారని మా పేస్టర్ చెప్పాడు. ఆఫ్రికాలో మాకు ఊడూ బొమ్మలు, శాపాలవల్ల మరో బాధ" ఐజాక్ బాధగా చెప్పాడు.

"ఓరోజు నా పక్కమీద, మంచం చుట్టూ ఉప్పు కనిపించింది. అది ఎలా వచ్చిందో నాకు అర్థం కాలేదు. అనస్థాషియాని అడిగితే ఊడూకి రక్షణకి చల్లానని చెప్పింది" చైత్ర వెంటనే చెప్పింది.

"రేపాఫ్ నాన్‌కింగ్ ఏమిటి?" ఆద్య కొత్త విషయాన్ని తెలుసుకోడానికి వేసిన మొదటి ప్రశ్న అది.

"రెండో ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీ యూరోపియన్ దేశాలని ఆక్రమించుకుంటే, జపాన్ ఏషియన్ దేశాలని ఆక్రమించుకుంది. ఆ క్రమంలో చైనాలోని నాన్‌కింగ్ అనే ఊరికి వెళ్ళిన జపనీస్ సైనికులు అక్కడ చేసిన అమానుష కృత్యాలు, అత్యాచారాలు అన్నీ ఇన్నీ కావు. వయసుతో నిమిత్తం లేకుండా మహిళలందర్నీ బలాత్కరించి చంపారు. ఓ జపనీస్ సైనికుడు పసికందుల్ని గాల్లోకి ఎగరేస్తే, మరో జపనిస్ సైనికుడు ఆ బిడ్డని తన తుపాకీ బానెట్‌కి గుచ్చుకునేలా పట్టుకునే పాశవిక ఆటని ఆడారు. కాని యూదులమీద జరిగిన హింసాకాండలా ఈ జపనీస్ హింసాకాండకి తగిన ప్రచారం లభించలేదు. దాన్నే రాపాఫ్ నాన్‌కింగ్ అంటారు" ఎన్రికో చెప్పాడు.

అతను తన మొబైల్‌ని ఆద్యకి ఇచ్చి చెప్పాడు.

"నేనీ ప్రదేశాన్ని చూసాను. చూడు."

ఆ ఫోటోలోని చిన్నపిల్లల లోహ విగ్రహాలు అక్కచెల్లెళ్ళు ఇద్దరూ చూసాక చెప్పాడు.

"రెండో ప్రపంచ యుద్ధం జరిగేప్పుడు, 1942లో నాజీ సైనికాధికారి రైనార్డ్ హేడ్రక్‌ని తిరుగుబాటుదారులు చంపారు. దాంతో నాజీలు ప్రతీకారంగా లిడిస్ అనే గ్రామంలో, దాని పక్క గ్రామంలోని ఇళ్ళని నేలమట్టం చేసారు. ఆ గ్రామాలకి రోడ్లని, నదీ మార్గాలని బ్లాక్ చేసారు. అక్కడి ప్రజలని, ఆఖరికి జంతువులని కూడా చంపేసారు. అలా ఆ రెండు గ్రామాల్లోని మొత్తం మూడువందల నలభై మందిని చంపేసారు. వారిలో ఎనభై ఎనిమిదిమంది పిల్లలు. లిడిస్ గ్రామంలోని చంపబడ్డ పిల్లల విగ్రహాలివి. ఓ శిల్పి శ్రమపడి వారి ఫోటోలని సంపాదించి, వారి జ్ఞాపకార్థం వీటిని చెక్కాడు."

ఆరేళ్ళ అక్క చేతిని పట్టుకుని మొహం దించుకుని నిలబడ్డ రెండున్నరేళ్ళ పిల్లవాడిని చూసాక ఆద్య మనసు ద్రవించింది.

"వీళ్ళు కాదుగా ఆ సైనికాధికారిని చంపింది? ఇంత పసికందులని ఎందుకు చంపడం?" బాధగా అడిగింది.

"వారిని ప్రశ్నించి, శిక్షించేవారు లేకపోవడం, నాజీలంటే ప్రజల్లో భయాన్ని రేకెత్తించడం, భవిష్యత్‌లో ఎవరూ తమ సైనికాధికారులని చంపకుండా హెచ్చరిక చెయ్యడం కోసం. ప్రతీ యుద్ధంలో సైనికులకంటే ఆక్రమించబడ్డ భూభాగంలోని లక్షలమంది అమాయక పౌరులు బలౌతూంటారన్నది చారిత్రక సత్యం.ఆడవాళ్ళైతే మాన ప్రాణాలని కోల్పోతారు."

"మేము యూరప్‌లో, ఆఫ్రికాలోకాక ఇండియాలో పుట్టడం మా అదృష్టం అనిపిస్తోంది. ఇలాంటివేమీ మాకు జరగలేదు" ఆద్య చెప్పింది.

"నిజమే. మేము ఎన్నడూ యుద్ధాన్ని చూడలేదు" చైత్ర చెప్పింది.

"మీకు పాకిస్థాన్‌తో యుద్ధాలు జరిగాయి కదా?" ఎన్రికో ప్రశ్నించడు.

"అవును. చైనాతో కూడా. కాని మా సౌత్ ఇండియా సేఫ్. అవన్నీ మాకు వందల మైళ్ళ దూరంలో జరిగాయి"

ఎన్రికో నవ్వి చెప్పాడు.

"ప్రపంచంలో ఏ ప్రాంతం సేఫ్ కాదు. దాన్నిండా అలాంటి క్రూరమృగాలున్నారు. సమయం, అవకాశం వస్తేకాని వారిలోని మృగత్వం బయటకి రాదు. నాజీలు, జపాన్ సైనికులు, సిరియన్ ఉగ్రవాదులు, తిరుగుబాటుదారులు అంతా మనలాంటి సామాన్య ప్రజలే. వారిలోంచే ఈ క్రూరులు పుట్టుకొచ్చారు. కాబట్టి మా మధ్య ఉన్న సాటి మనిషిని సాధువుగా నమ్మకూడదు. వారిలోని నిగూఢమైన మృగత్వానికి భయపడాలి. ప్రపంచంలోని బంగారంలో పదకొండు శాతం ఇండియన్ మహిళల దగ్గరే ఉందని మీకు తెలుసా? గాడ్ ఫర్బిడిట్. కాని ఎప్పుడు యుద్ధం జరిగి శత్రుసైనికులు మీ ఊళ్ళల్లోకి ప్రవేశిస్తే, వాళ్ళు ఇల్లిల్లూ వెదికి, బంగారం ఇవ్వమని బెదిరించి, హింసించి ఇచ్చినా, ఇవ్వకపోయినా కుటుంబం అంతటినీ చంపేస్తారు. ఇది యుద్ధ సైనికుల స్వభావం."

ఆద్య అక్కవంక భయంగా చూసింది. అవునన్నట్లుగా చైత్ర తలూపింది.

గాడ్స్ గ్రేస్ ఫ్రూట్ జూస్ షాప్‌ని చూసి ఎన్రికో దానిముందు ఆపించాడు. నలుగురూ జామ జ్యూస్ తాగారు. అక్కడ జామ బాగా పండుతుంది. ఎదురుగా ఉన్న అకింగ్ ఆఫ్ గ్లోరీ బేకరీలోకి వెళ్ళి ఎగ్ రోల్స్‌ని తెచ్చాడు.

"మనకో సండే కావాలి" ఎన్రికో వాళ్ళని దింపాక చెప్పాడు.

"అంటే?" చైత్ర అడిగింది.

"సండే, మండే మధ్య ఇలా టైం స్పెండ్ చెయ్యడానికి ఇంకో వారం కావాలి. థాంక్స్ టు బోతాఫ్ యు. ఈ ట్రిప్ నాకు బాగా నచ్చింది. రేపు వీక్లీ పాట్‌లక్ మీట్‌లో కలుద్దాం. గుడ్ నైట్" చెప్పాడు.

"గుడ్ నైట్" ఇద్దరూ చెప్పారు.

అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ స్నానం చేసి సేద తీరాక చైత్ర హైదరాబాద్‌లోని తన తల్లికి వాట్సప్ కాల్ చేసింది.

"నిద్రపోబోతున్నాం. అదెలా ఉంది?" ప్రవర్ధన వెంటనే అడిగింది.

"బానే ఉంది. వీకెండ్ కాబట్టి మూడు టూరిస్ట్ స్పాట్స్‌ని చూసి ఇప్పుడే తిరిగి ఇంటికొచ్చాం."

తాము ఎక్కడెక్కడికి వెళ్ళి ఏమేం చూసారో చైత్ర చెప్పింది.

"అమ్మతో నేనూ మాట్లాడతానక్కా" ఆద్య కోరింది.

వెంటనే చైత్ర చెల్లెలికి ఫోన్ ఇచ్చింది. ఇంట్లోంచి బయలుదేరాక ఆమె కోరి తల్లితో మాట్లాడటం అదే మొదటిసారి.

"ఎలా ఉన్నావే?" ఆద్య కంఠం వినగనే ప్రవర్ధన ఆనందంగా అడిగింది.

"ఫైన్. నువ్వెలా ఉన్నావు? నాన్న?"

"అంతా బానే ఉన్నాం. నీకు అక్కడ ఎలా ఉంది? బాగానే టైం పాస్ అవుతోందా?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments